TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక


విలేఖరులు కావలెను


అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగేస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలని అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...


సంపుటి : 1 సంచిక :105 prajadivvs57@gmail. com సోమవారం, ఫిబ్రవరి-9 , 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-

## ఆర్ఎస్ఎస్ పదవికి ఎన్నికలు ఉండవు



వయసుతో సంబంధం లేకుండా బాధ్యతలు నెరవేర్చాలని కోరిన సంఘ్

వైదొలగాలని కోరితే దిగిపోవడానికి సిద్ధంగా ఉన్నాను

రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలు

2

## భారత్, మలేషియాల మధ్య.... ఆడియో విజువల్ ఒప్పందం

యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్' ఏర్పాటుకు నిర్ణయం

మలేషియా ప్రధానికి ఎంజీఆర్ పాటలంటే ఇష్టమన్న మోదీ




2

## తోషఖానా కేసులో... ఇమ్రాన్, భార్యకు 17 ఏళ్ల జైలు

సౌదీ బహుమతులను తక్కువ ధరకు తీసుకున్నారని ఆరోపణలు

దంపతులిద్దరికీ చెరో రూ. 1.64 కోట్ల జరిమానా



2

# కిషన్ రెడ్డి నల్లికుట్లోడు

### విచారణ కమిషన్ రిపోర్ట్ తో సిబిఐకి కాళేశ్వరం కేసును అప్పగించినా ఏవీ చర్యలు..?

కేంద్రంలో సిబిఐ, ఈడి సోనియా, రాహుల్ గాంధీలను విచారణ చేయడం

అన్ని ఆధారాలతో కాళేశ్వరంను అప్పగించినా ప్రారంభం కానీ విచారణ..!

కొత్త జిల్లాలు లేవు ఉన్న జిల్లాలను మార్చేది లేదు

సింగరేణి కార్మికులకు నష్టం కలిగించే ఏ నిర్ణయమూ తీసుకోము, బిల్లెల్ తీసుకుపోము సీఎం రేవంత్‌రెడ్డి



సింగరేణి ఎకార్మికులకు నష్టం కలిగించే ఏ నిర్ణయమూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొందరు ప్రభుత్వంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని, మెడికల్ బోర్డు విషయంలో విషం చిమ్మితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు.పుర ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. రేగొండ మండలం కొడవటంచ చేరుకున్న సీఎం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించి, పక్కనే ఉన్న బాలాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రూ. 12.15 కోట్లతో చేపడుతున్న ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ పనుల్లో భాగంగా నిర్మించిన వసతి గృహ భవనాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం గణపురం మండలం చెల్పూర్ పరిధిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉంది. దేశానికే నాయకత్వం వహించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహించారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాది కీలకపాత్ర. సింగరేణి కార్మికుల ప్రత్యేకతను ..మిగతా 2లో



## రేవంత్‌తో బీజేపీ లాలూచీ

లేదనుకుంటే విశ్రాంతి జడ్జితో విచారణ చేయించండి

ఓటుకు నోటు ఆధారాలను రూపుమాపేందుకే అగ్నిప్రమాదం నాటకం

ఫోరెన్సిక్ ల్యాబ్ అడ్మిన్ ప్రమాదంపై కేటీఆర్ వ్యాఖ్యలు

తెలంగాణ స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ లో జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ..మిగతా 2లో

## అభయహస్తం కాదు.. భస్మాసుర హస్తం

తాండూరు సభలో కేటీఆర్ ఫైర్

2

## మంత్రి పదవి ఇచ్చారు.. ఎమ్మెల్సీ పదవి మాత్రం లేదు



సుమారు మూడు నెలల క్రితం, అంటే జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల సమయంలో మహ్మద్ అజారుద్దీన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మంత్రి పదవిపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు విమర్శల వర్షం కురిపించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం బాగానే ఉన్నా, ఇంకా ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. 'అజారుద్దీన్‌కు మంత్రి పదవి వచ్చి 3 నెలలైంది. ఇంకా ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదు. ఇంకో ..మిగతా 2లో




## ఓటుకు నోటు కేసులో... ఆధారాలు కాలిపోలేదు

కొన్ని డాక్యుమెంట్లు కాలిపోయాయి, డేటాకు నష్టం లేదన్న శిఖా గోయల్

హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

'ఓటుకు నోటు' కేసు ఆధారాలు కాలిపోయాయన్నది అసత్యం

సాక్ష్యాలన్నీ 2021లోనే కోర్టుకు ఇచ్చామన్న డైరెక్టర్ శిఖా గోయల్

ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన మెటీరియల్స్ కూడా సురక్షితం

2

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్ నిధులివ్వ లేదు: భట్టి

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, కాలనీలు నిర్మించిందని చెప్పారు. ఇప్పుడు కూడా అదే తరహాలో ఇస్తున్నామన్నారు. "మన నిధులు మనకే ఖర్చు చేయాలని పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం నిధులను పేదల కోసం ఖర్చు చేయలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు కేసీఆర్ నిధులు ఇవ్వలేదు. సాగుకు ఉచిత విద్యుత్‌ను మొదటిసారి అమలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. ప్రస్తుతం ప్రతి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని భట్టి విక్రమార్క కోరారు.



## బిజెపిని గెలిపిస్తే స్మార్ట్ సిటీగా నల్గొండ

రాష్ట్రంలో ఒకడు దొంగ అయితే మరొకరు దోపిడీ దొంగ

కాంగ్రెస్, బిఆర్ఎస్‌లో ఎవ్వరికి ఓటేసినా ఒక్కటే

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

2



## నగర పోలీసులకు... ఎక్స్‌ట్రా మైల్ పురస్కారాలు

విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభకు గాను 1,446 మందికి అవార్డులు

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, అసాధారణ ప్రతిభ కనబరిచిన 1,446 మంది పోలీసు సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ రివార్డులు అందజేశారు. నగర పోలీసు చరిత్రలో తొలిసారిగా ప్రవేశపెట్టిన 'ఎక్స్‌ట్రా మైల్' పురస్కారాలతో పాటు 'గుడ్ వర్క్ డన్' రివార్డులను పోలీస్ సిబ్బందికి ఉన్నతాధికారులతో కలిసి ఆయన ప్రదానం చేశారు. హైదరాబాద్ ..మిగతా 2లో

# ఓటుకు నోటు కేసులో... ఆధారాలు కాలిపోలేదు

హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో శనివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో, గతంలో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు ఫోన్ ట్యాపింగ్' కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు కాలిపోయాయంటూ సోషల్ మీడియాలో, కొన్ని మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్ తీవ్రంగా ఖండించారు. కీలక కేసులకు సంబంధించిన ఆధారాలన్నీ సురక్షితంగా ఉన్నాయని, ఎలాంటి డేటా నష్టం జరగలేదని ఆమె స్పష్టం చేశారు. శనివారం ఉదయం 10:08 గంటల సమయంలో ల్యాబ్ కార్యాలయంలోని సీజ్డ్ ప్రాపర్టీస్ విభాగంలో మంటలు చెలరేగాయి. అక్కడి సిబ్బంది గమనించి వెంటనే అప్రమత్తమైనప్పటికీ, మంటలు వేగంగా ల్యాబ్‌తో పాటు శిక్షణా కేంద్రానికి వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కొన్ని అనాలసిస్ డాక్యుమెంట్ ఫైళ్లు మాత్రమే దగ్ధమయ్యాయని, వాటిని కూడా రికవరీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని శిఖా గోయల్ వివరించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ముఖ్యంగా, తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేపిన 2015 నాటి 'ఓటుకు నోటు' కేసుకు సంబంధించిన ఆధారాలు ధ్వంసమయ్యాయని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆమె తేల్చిచెప్పారు. ఆ కేసుకు సంబంధించిన 16 మెటీరియల్ ఆబ్జెక్టులను 2015లోనే స్వీకరించి, పరీక్షించిన తర్వాత 2021 మార్చిలోనే ఏసీబీ కోర్టుకు తిరిగి సమర్పించామని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు ఈ కేసుకు సంబంధించిన ఒక్క ఆధారం కూడా ఎఫ్ఎస్ఎల్‌లో లేదని ఆమె తెలిపారు. అదేవిధంగా, ఇటీవలి ఫోన్ ట్యాపింగ్ కేసుకు పంజాగుట్ట పీఎస్ క్రైమ్ నెం. 243/2024 సంబంధించి మార్చి 2024 నుంచి జనవరి 2026 మధ్య అందిన 132 మెటీరియల్ ఆబ్జెక్టులను పూర్తిగా పరిశీలించామని, వాటన్నింటినీ సురక్షితంగా వెలికితీశామని గోయల్ చెప్పారు. వాటి నివేదికలు ఇప్పటికే కొన్ని కోర్టుకు సమర్పించగా, మరికొన్ని సిద్ధమవుతున్నాయని అన్నారు. ఒకవేళ ఏవైనా డాక్యుమెంట్లు కాలిపోయినా, వాటి డేటాను తిరిగి పొందే సాంకేతిక సామర్థ్యం తమ బృందానికి ఉందని, ఆధారాల భద్రత విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. ల్యాబ్‌లో కాలిపోయినవి ఇప్పటికే కోర్టులకు సమర్పించిన డాక్యుమెంట్ల కాపీలేనని, ఒరిజినల్స్ కోర్టు వద్ద భద్రంగా ఉంటాయని ఆమె పునరుద్ఘాటించారు. ఈ అగ్నిప్రమాదంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఆర్ఎస్ఎస్ పదవికి
# ఎన్నికలు ఉండవు

తన రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. వయసుతో సంబంధం లేకుండా పనిని కొనసాగించాలని సంఘ్ తనను కోరిందన్నారు. ఒకవేళ దిగిపోవాలని ఆదేశిస్తే వైదొలగేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ముంబయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఆరెస్సెస్ చరిత్రలో ఇంతవరకు ఎవరినైనా పదవీ విరమణ చేయించాల్సిన పరిస్థితి రాలేదన్నారు. "ఆరెస్సెస్ చీఫ్ పదవికి ఎన్నికలు ఉండవు. రీజినల్, డివిజనల్ అధిపతులు సర్‌సంఘ్ చాలక్‌ను నియమిస్తారు. సాధారణంగా 75 ఏళ్లు నిండిన తర్వాత ఎలాంటి పదవిలో లేకుండా పని చేయాలంటారు. నాకు 75 ఏళ్లు నిండాయి. ఈ విషయాన్ని సంఘ్‌కు తెలియజేశాను. కానీ యథావిధిగా కొనసాగాలని కోరింది. పదవి నుంచి వైదొలగాలని ఎప్పుడు కోరినా సిద్ధంగా ఉన్నాను. కానీ, పని నుంచి మాత్రం ఎప్పటికీ విరమణ ఉండదు" అని భాగవత్ చెప్పారు. చివరి రక్తపు బొట్టు వరకు స్వయంసేవకుల నుంచి సంఘ్ పని చేయించుకుంటుందని సరదాగా వ్యాఖ్యానించారు.

**అమెరికా విడుదల చేసిన భారత్ మ్యాప్‌లో పీవోకే**

వీర్ సావర్కర్‌కు భారతరత్న పురస్కారం ఇస్తే దాని ప్రతిష్ఠ పెరుగుతుందని భాగవత్ అన్నారు. దేశ ప్రయోజనాలకు నష్టం వాటిల్లకుండా భారత్- అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు భావిస్తున్నానని చెప్పారు. అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకొని 'ఉమ్మడి పౌరస్మృతి' రూపొందించాలని, అది విభేదాలకు దారి తీయకూడదని పేర్కొన్నారు. ప్రచారం చేయడం సంఘ్ పని కాదని, సంస్కారాలను పెంపొందించడమే నని తెలిపారు.

## భారత్, మలేషియాల మధ్య....
# ఆడియో విజువల్ ఒప్పందం

**యూనివర్సిటీలో**

**'తిరువళ్లువర్ సెంటర్' ఏర్పాటుకు నిర్ణయం**

**మలేషియా ప్రధానికి**
**ఎంజీఆర్ పాటలంటే ఇష్టమన్న మోదీ**

భారత్, మలేషియా మధ్య సాంస్కృతిక సంబంధాలను తమిళ భాష బలంగా పెనవేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇరు దేశాల మధ్య తాజాగా కుదిరిన ఆడియో విజువల్ ఒప్పందం ద్వారా తమిళ చిత్రాలు, సంగీతం మన హృదయాలను మరింత దగ్గర చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కౌలాలంపూర్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి ఆదివారం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. మలేషియా విద్య, మీడియా, సాంస్కృతిక జీవనంలో తమిళ భాషకు బలమైన, సజీవమైన ఉనికి ఉందని మోదీ ప్రశంసించారు. అంతకుముందు శనివారం జరిగిన 'సెలమత్ దతాంగ్ మోదీజీ' కార్యక్రమంలో 12 వేల మందికి పైగా ప్రవాస భారతీయులు, స్నేహితులు పాల్గొన్నారు. ఈ సభకు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా హాజరయ్యారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ప్రవాస భారతీయ సమాజం మలేషియాలో ఉందని, ఇరు దేశాల ప్రజల హృదయాలను కలిపే అంశాలు చాలా ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంకు లెజెండరీ నటుడు ఎంజీఆర్ పాటలంటే ఎంతో ఇష్టమని మోదీ గుర్తుచేశారు. బటు కేవ్స్‌లో జరిగిన తైపూసం వేడుకలు, మలేషియాలో గర్బా నృత్యం ప్రాచుర్యం పొందడం మన సాంస్కృతిక బంధానికి నిదర్శనమని అన్నారు. తమిళం ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప బహుమతి అని, తమిళ సాహిత్యం శాశ్వతమైనదని కొనియాడారు. భారత ఉపరాష్ట్రపతి, విదేశాంగ, ఆర్థిక మంత్రులు తమిళనాడుకు చెందినవారేనని ఆయన సభలో ప్రస్తావించారు. ఈ చారిత్రక స్ఫూర్తితో, ఇప్పటికే ఉన్న తిరువళ్లువర్ చైర్‌కు అదనంగా మలయా యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

# బిజెపిని గెలిపిస్తే స్మార్ట్ సిటీగా నల్గొండ



రాష్ట్రంలో కాంగ్రెస్‌కి ఓటేసినా. బీఆర్ఎస్‌కు వేసినా ఒక్కటేనని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఎద్దేవా చేశారు. ఒకరు దొంగ అయితే మరొకరు దోపిడీ దొంగ అని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అదే భాజపా నేతలు ఓడినా గెలిచినా ఒకే పార్టీలో ఉంటారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. నల్గొండ క్లాక్ టవర్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్పొరేషన్ ఎన్నికల విజయ సంకల్ప సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లిస్తోందని విమర్శించారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో భాజపా జెండా ఎగరబోతోందని జోస్యం చెప్పారు. నల్గొండలో ఇప్పటికీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదన్నారు. భాజపాను గెలిపిస్తే నల్గొండను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు అవకాశాలు ఇచ్చారు. ఒక్కసారి భాజపాకు అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. భాజపాకు అవకాశం ఇస్తే తెలంగాణను అవినీతి లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

# కిషన్ రెడ్డి నల్లికుట్లోడు

మొదటి పేజీ తరువాయి...

ఉద్యమంలో చూశాం. భూపాలపల్లి జిల్లాను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జిల్లాలను రద్దు చేసే ఆలోచన మాకు లేదు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేయాలంటే ప్రజలతో చర్చించే చేస్తాం. భూపాలపల్లి జిల్లా ఎక్కడికీ పోదు కొనసాగుతుంది.

**కేసీఆర్, కేటీఆర్‌ను కాపాడుతున్నది కిషన్‌రెడ్డి కాదా**

2004-14 మధ్య 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చాం. గత పదేళ్లలో ఎవరికైనా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చిందా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితకు మాత్రం ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. కేసీఆర్‌కు పేదల పట్ల ఎలాంటి పట్టింపు లేదు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్నీ బీఆర్ఎస్‌కు, ఇందిరమ్మ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్నీ కాంగ్రెస్‌కు అని ఆనాడు చెప్పాను. అందుకే ప్రజలు కాంగ్రెస్‌కు గంపగుత్తగా ఓట్లు వేశారు. ఏప్రిల్ తర్వాత ఇందిరమ్మ ఇళ్లు రెండో విడత ఇస్తాం. దక్షిణ కుంభమేళాగా సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహించుకొన్నాం. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న దేవాలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తాం. అటవీ ప్రాంతంలో రిసార్ట్‌లను అభివృద్ధి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు ఫోన్ ట్యాపింగ్ ద్వారా వ్యాపారులను బెదిరించి ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో రూ.1500 కోట్లు తీసుకున్నారు. బీఆర్ఎస్ అంటే బ్లాక్ మెయిల్ రాజకీయ సమితి. పాపాల ఊబిలో ఆ పార్టీ కూరుకు పోతుంది. కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్, కేటీఆర్ అరెస్టును ఆపుతున్నారు. నేను ముఖ్యమంత్రినా కేసీఆర్‌ను అరెస్టు చేయడానికి' అని కిషన్‌రెడ్డి చెబుతున్నారు. సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని సీబీఐ, ఈడీ కేసులతో అవమానిస్తున్నారు. కాళేశ్వరంలో అవినీతి చేసిన కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను కాపాడుతున్నది మీరు కాదా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్‌తో బీజేపీ లాలూచీ

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనే అన్నారు. ఓటుకు నోటు కేసు నుంచి తప్పించుకోవడానికే ఇలా చేశారని అనుమానం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అందరూ బిజీగా ఉన్నారు. ఇదే అదునుగా భావించి కుట్ర చేశారని కేటీఆర్ ఆరోపించారు. పక్కా ప్లాన్‌తో ఆధారాలు మాయం చేశారని మండిపడ్డారు. తాను తప్పించుకోవడానికి మిగతా కేసులకు సంబంధించిన ఆధారాలు కూడా దెబ్బతినేలా ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్నిప్రమాద ఘటనపై ఎఫ్ ఎస్ ఎల్ డైరెక్టర్ తూతూమంత్రంగా వివరణ ఇచ్చారని విమర్శించారు. అగ్ని ప్రమాద ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మూడు అంతస్థుల భవనంలో మంటలను ఆర్పేందుకు మూడు గంటల సమయం పడుతుందా అని ప్రశ్నించారు. దాంతో పాటు ప్రమాద సమయంలో డ్యూటీలో కూడా ఎవరూ లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు. స్వయంగా సీఎం చేతిలో ఉన్న శాఖలో ఇలా జరగడం చరిత్రలో తొలిసారి అన్నారు. విచారణ చివరి దశకు చేరుకోవడంతో సాక్ష్యాలు మాయం చేశారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డితో బీజేపీకి లాలూచీ లేకపోతే దీనిపై విచారణ జరిపించాలి అని డిమాండ్ చేశారు. అగ్నిప్రమాదంపై తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ఫోరెన్సిక్ ల్యాబ్ డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ అగ్నిప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. ప్రమాదానికి గల కారణాలపై వారు దర్యాప్తు చేపట్టారు. జరిగిన నష్టంపై అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. దీనిపై స్పష్టత వచ్చాక వివరాలు వెల్లడిస్తాం. ఈ ప్రమాదంపై కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. రెండు కీలక కేసుల్లోని ఆధారాలు కాలిపోయినట్లు దుష్ప్రచారం జరుగుతోంది. ఆయా కేసులకు సంబంధించిన సామగ్రిని గతంలోనే కోర్టుకు అప్పగించాం. 2015 నాటి ఏసీబీ కేసు విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన కేసులోనూ ఆధారాలు కోర్టుకు సమర్పించాం. 2024 వరకు సేకరించిన 136 ఆధారాల్లో 7 మినహా మిగతావన్నీ న్యాయస్థానానికి ఇచ్చేశాం. అన్ని ఆధారాలు, పరికరాలను ఎఫ్ఎస్ఎల్ సురక్షితంగా ఉంచుతుంది. ఏదైనా జరిగితే మా టీమ్ సమాచారాన్ని పునరుద్ధరిస్తుంది అని శిఖా గోయల్ చెప్పారు.

## నగర పోలీసులకు...
# ఎక్స్‌ట్రా మైల్ పురస్కారాలు

మొదటి పేజీ తరువాయి...

బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) వేదికగా ఈ పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను అభినందిస్తూ నగర పోలీస్ కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్, కీలక ప్రసంగం చేశారు. పోలీసు వృత్తి కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, అదొక సామాజిక బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. విధులకు మాత్రమే పరిమితం కాకుండా సమాజం పట్ల జవాబుదారీ తనంతో వ్యవహరించాలని, ప్రతి పనిలోనూ సృజనాత్మకత, మానవీయత ప్రతిబింబించాలని పిలుపునిచ్చారు. అప్పగించిన పనిని పూర్తి చేయడం కంటే, బాధితులకు ఎంతటి భరోసాను కల్పించామన్నదే అసలైన విజయమని స్పష్టం చేశారు. విధులకు అతీతంగా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించినప్పుడే పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. కాగా, గత ఆర్థిక ఏడాదికి సంబంధించిన 2, 3, 4వ త్రైమాసికాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఎక్స్‌ట్రా మైల్ లో భాగంగా విధి నిర్వహణలో విధులకు అతీతంగా సేవలందించిన 271 మందికి ఈ పురస్కారం దక్కింది. గుడ్ వర్క్ డన్ లో భాగంగా విధుల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 1,175 మందికి ఈ రివార్డులు వరించాయి. పురస్కారాలు అందుకున్న వారిలో అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు మినిస్టీరియల్ సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీ ఎం. శ్రీనివాసులు, జాయింట్ సీపీ నార్త్ రేంజ్ శ్ర ఎన్ .శ్వేత, , డీసీపీలు ఎస్.చైతన్య కుమార్, శిల్పవల్లి, వి.అరవింద్ బాబు, లావణ్య నాయక్ జాదవ్ , కె. వెంకట లక్ష్మి, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ం

## మంత్రి పదవి ఇచ్చారు..
## ఎమ్మెల్సీ పదవి మాత్రం లేదు

మొదటి పేజీ తరువాయి...

మూడు నెలల్లో ఎమ్మెల్సీ కాకపోతే మంత్రి పదవి పోతుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మేం ప్రశ్నించినందుకే అజారుద్దీన్‌కు మంత్రి పదవి దక్కింది' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు హరీష్‌రావు. అజారుద్దీన్ తెలంగాణ ప్రభుత్వంలో పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. ఈ పదవిని ఆయన 31 అక్టోబర్ 2025న స్వీకరించారు. అదేవిధంగా, ఆయన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూడా కొనసాగుతున్నారు . అయితే ఎమ్మెల్సీగా లేరు. అంటే, ప్రస్తుతం ఆయనకు ఉన్న పదవి రాష్ట్ర మంత్రిగా ఉన్నారు కానీ ఎమ్మెల్సీగా లేరు. రాష్ట్ర మంత్రిగా ఉండాలంటే అటు ఎమ్మెల్యేగా కానీ, ఎమ్మెల్సీ కానీ ఉండాలి,ఇదే విషయాన్ని ప్రశ్నించారు హరీష్‌రావు.

## తోషఖానా కేసులో...
# ఇమ్రాన్, భార్యకు 17 ఏళ్ల జైలు

పలు కేసుల్లో దోషిగా తేలి జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్ ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో విచారణకు రానున్న పిటిషన్లు. పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు న్యాయస్థానంలో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తీవ్ర సంచలనం సృష్టించిన తోషఖానా-2 అవినీతి కేసులో ఆయనకు, ఆయన భార్య బుష్రా బీబీకి ప్రత్యేక కోర్టు 17 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష విధించింది. అధికారంలో ఉన్నప్పుడు సౌదీ ప్రభుత్వం నుంచి అందిన ఖరీదైన బహుమతులను ప్రభుత్వ ఖజానాలో జమ చేయకుండా, తక్కువ ధరకు అక్రమంగా సొంతం చేసుకున్నారన్న ఆరోపణలు ఈ కేసులో రుజువయ్యాయి. రావల్పిండిలోని అడియాలా జైలులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి షారుఖ్ అర్జుమంద్ ఈ తీర్పును వెలువరించారు. నేరపూరిత విశ్వాసఘాతుకానికి పాల్పడినందుకు 10 ఏళ్లు, అవినీతి నిరోధక చట్టం కింద మరో 7 ఏళ్ల జైలు శిక్షను ఖరారు చేశారు. దీంతో పాటు ఇద్దరికీ చెరో రూ. 1.64 కోట్ల జరిమానా కూడా విధించారు. ఇమ్రాన్ ఖాన్ వయసు, బుష్రా బీబీ మహిళ కావడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కాస్త తక్కువ శిక్ష విధించినట్లు తీర్పులో పేర్కొన్నారు. 2022 ఏప్రిల్‌లో అధికారం కోల్పోయినప్పటి నుంచి 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ డజన్ల కొద్దీ కేసులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. 2023 ఆగస్టు నుంచి ఆయన అడియాలా జైలులోనే ఉంటున్నారు. ఈ తాజా తీర్పుతో ఆయనపై ఉన్న కేసుల సంఖ్య, శిక్షల కాలం మరింత పెరిగింది. ఇదిలా ఉండగా, ఈ శిక్షతో పాటు ఇతర కేసులకు సంబంధించి దాఖలైన 13 పిటిషన్లను ఫిబ్రవరి 9న విచారించేందుకు పాకిస్థాన్ సుప్రీంకోర్టు నిర్ణయించింది. ఈ తీర్పును హైకోర్టులో సవాలు చేసేందుకు ఇమ్రాన్ దంపతులకు అవకాశం ఉంది.

## గిరిజన ఆశ్రమ పాఠశాలలో
# ఫుడ్ పాయిజనింగ్

ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో గల ఓ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో 92 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణకు ఆదేశించారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం లోగా దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే పోలవరం జిల్లా రంపచోడవరం మండలం దేవరపల్లిలోని ఆశ్రమ బాలుర వసతి గృహంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారులతో చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. శనివారం ఉదయం అల్పాహారం తిన్న తర్వాత 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయని అధికారులు సీఎంకు వివరించారు. వెంటనే వారిని మారేడుమిల్లి, రంపచోడవరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వారు పేర్కొన్నారుఘటన జరిగిన వెంటనే హాస్టల్‌ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను అంచనా వేశామని అధికారులు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న మిగతా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు, ఆహారం, నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపినట్లు వివరించారు. ఈ ఘటనపై విచారణకు ఒక జాయింట్ ఇన్స్‌పెక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## పవన్ గారు... ఒక్కసారి
# కలిసే అవకాశం ఇవ్వండి

**పవన్‌కు విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలు**

జనసేన పార్టీలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం పెను సంచలనం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ ఘటనపై విచారణ జరిపేందుకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసిన జనసేన పార్టీ. అరవ శ్రీధర్ నుంచి వివరాలు సేకరించింది. తన వద్ద ఉన్న ఆధారాలు కమిటీకి ఇచ్చానని అన్ని విషయాలు కూడా వెల్లడించానని కమిటీ విచారణ తర్వాత రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మీడియాకు వెల్లడించారు. అయితే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి మీడియా సమావేశాలు నిర్వహించి అరవ శ్రీధర్‌పై సంచలన ఆరోపణలు చేస్తున్న బాధిత మహిళ.. సోషల్ మీడియా వేదికగా కూడా కొన్ని వీడియోలను విడుదల చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి ఒక వీడియోను రిలీజ్ చేసింది. తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని పవన్ కళ్యాణ్‌ను బాధిత మహిళ ఆ వీడియోలో కోరింది. తనకు జరిగిన అన్యాయాన్ని పవన్ కళ్యాణ్‌ను కలిసి వివరించాలని భావిస్తున్నానని. ఆయనే తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. ఎవరు పడితే వాళ్లతో మాటలు పడాల్సిన దౌర్భాగ్యం తనకు పట్టలేదని ఒక్కసారి పవన్ కళ్యాణ్‌ను కలిసే అవకాశం తనకు ఇస్తే అసలు మొత్తం ఏం జరిగింది అనేది పూర్తిగా వివరిస్తానని ఆ వీడియోలో తెలిపింది. అంతేకాకుండా అరవ శ్రీధర్ ఒక ఎమ్మెల్యే కాకున్నా, ప్రభుత్వ విప్ పదవి లేకుండా ఒక సాధారణ వ్యక్తి అయితే తనకు అతడు చేసిన ద్రోహానికి ఇప్పటికే అరెస్ట్ అయి జైలులో ఉండేవాడని ఆ మహిళ పేర్కొంది. అరవ శ్రీధర్ ప్రస్తుతం పదవిలో ఉన్నాడు కాబట్టే ధైర్యంగా బయట తిరుగుతున్నాడని సంచలనం ఆరోపణలు గుప్పించింది. దీన్ని బట్టి చూస్తుంటే ఈ వ్యవహారంపై అందరూ కలిసి రాజకీయం చేస్తున్నట్లు అర్థం అవుతోందని తెలిపింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఈ వ్యవహారంలో రాజకీయం చేస్తోంది అరవ శ్రీధరేనని తాను ఎలాంటి రాజకీయాలు చేయట్లేదని బాధిత మహిళ స్పష్టం చేసింది. మరోవైపు జనసేన పార్టీ కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఈ ఘటనలో నిజానిజాలు తెలుసుకునేందుకు. ఇటీవలే జనసేన పార్టీ ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయగా.. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆ కమిటీ ముందు హాజరై పూర్తి వివరాలు వెల్లడించారు. తన వద్ద ఉన్న ఆధారాలు అన్నింటినీ కమిటీకి అప్పగించానని, ఈ వ్యవహారంలో పార్టీ హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తాను కట్టుబడి ఉంటానని అరవ శ్రీధర్ తేల్చి చెప్పారు. ఈ విషయం తమ పర్సనల్ విషయమని, దీన్ని పార్టీకి గానీ, పవన్ కళ్యాణ్‌కు గానీ ఆపాదించి మాట్లాడవద్దని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

## అభయహస్తం కాదు..
# భస్మాసుర హస్తం

**తాండూరు సభలో కేటీఆర్ ఫైర్**

ఉద్యోగాల పేరుతో యువతను కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆయన స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందిరా చౌక్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజల్ని మోసం చేశారని మండిపడ్డారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. రేవంత్ పాలనలో యూరియా కష్టాలు తప్పడం లేదని అన్నారు. చెప్పులు క్యూలైన్లలో పెట్టి ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడూ యూరియా కొరత లేదని మండిపడ్డారు. రైతుబంధు అడిగితే.. లాగులో తొండలు విడుస్తానని అంటున్నాడని విమర్శించారు. రెండున్నరేళ్లుగా సంక్షేమాభివృద్ధి లేక ప్రజలు గోసపడుతున్నారని తెలిపారు. బతుకమ్మ చీర లేదు.. కేసీఆర్ కిట్ లేదని విమర్శించారు. ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇస్తామని బోగస్ మాట చెప్పిండని మండిపడ్డారు. ఫిబ్రవరి 8వ తేదీకి కూడా రైతుబంధు పడలేదని తెలిపారు. వృద్ధులకు రూ.4వేల పింఛన్ ఇస్తామని మోసం చేశాడని అన్నారు. అత్తకు, కోడలికి ఇద్దరికీ రూ.2500 ఇచ్చిండా అని ప్రశ్నించారు. తులం బంగారం, రూ.4వేల పింఛన్, విద్యా భరోసా, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2500, స్కూటీలు ఇస్తామని అనేక హామీలు ఇచ్చిండని అన్నారు. కాంగ్రెస్ అడ్డగోలు హామీలు నమ్మి ప్రజలు మోసపోయిండని అన్నారు. అరచేతిలో వైకుంఠం చూపి అభయహస్తం చూపారని, అది అభయహస్తం కాదని భస్మాసుర హస్తమని అన్నారు. హామీలపై నిలదీస్తే కేసులు పెడుతున్నారని తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడమని స్పష్టం చేశారు. 420 హామీలు అమలయ్యే దాకా ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో అబద్ధాలాడి అయినా గెలవాలని కాంగ్రెస్ చూస్తోందని కేటీఆర్ విమర్శించారు. మొదటిసారి మోసం చేస్తే తప్పు ఎదుటి వారిదవుతుంది.. రెండోసారి మోసపోతే తప్పు మనది అవుతుందని అన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి
- పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి – 8 ప్రజా దివాస్** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించి అధికారులు, సిబ్బంది నియామకం, శిక్షణ పూర్తి చేశామని తెలిపారు.

**ప్రణాళిక ప్రకారం ముందుకు..**

మున్సిపల్ ఎన్నికల కోడ్ విడుదల అయిన వెంటనే ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పక్కా ప్రణాళిక ప్రకారం..అధికారులు సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించి, పూర్తి చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పక్కాగా చేసేలా ప్లాన్ రూపొందించారు. సిరిసిల్ల, వేములవాడ లోని సినారె కళామందిరాల్లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ అండ్ కౌంటింగ్ కేంద్రాల్లో ఎస్పీ మహేష్ బి గీతే తో కలిసి పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. సిరిసిల్ల, వేములవాడలోని స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ చెక్ పోస్టులను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పలుమార్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**పీపీటీ ద్వారా శిక్షణ**

ఎన్నికల సంఘం నిబంధన ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అలాగే సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. సిరిసిల్ల, వేములవాడలోని మున్సిపల్ కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి.. కావలసిన ఫారాలను అందుబాటులో ఉంచి ఓటు హక్కు వినియోగించుకునేలా సౌకర్యాలు కల్పించారు. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించి.. దివ్యాంగులకు ర్యాంపు, అధికారులు, సిబ్బందికి కనీస వసతులు కల్పించేలా ఆదేశాలు ఇచ్చారు.

**67 వార్డులు.. లక్ష 20వేలకు పైగా ఓటర్లు..**

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు ఉన్నాయి. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో మొత్తం 39 వార్డులు, వేములవాడ మున్సిపల్ పరిధిలో 28 వార్డులు ఉన్నాయి. మొత్తం కలిసి 67 వార్డులు ఉన్నాయి. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 117, వేములవాడ మున్సిపల్ పరిధిలో 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 283 (సిరిసిల్ల 170, వేములవాడ 113) మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 39,942 మంది పురుషులు, 42,011 మంది మహిళా ఓటర్లు, 06 ఇతర ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లు 81,959 మంది ఉన్నారు. అలాగే వేములవాడ మున్సిపల్ పరిధిలో 19,580 మంది పురుషులు, 21,279 మంది మహిళా ఓటర్లు, 18 ఇతర ఓటర్లు ఉన్నారు.మొత్తం ఓటర్లు 40,877 మంది ఉన్నారు. .రెండు మున్సిపాలిటీలో కలిపి 1,22,836 మొత్తం ఓటర్లు ఉన్నారు.

**ఎన్నికల అధికారులు..**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో రిటర్నింగ్ అధికారులు 15, వేములవాడ మున్సిపల్ పరిధిలో రిటర్నింగ్ అధికారులు 12 కలిపి మొత్తం 27 మందికాగా, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 15, వేములవాడ మున్సిపల్ పరిధిలో 12 కలిపి మొత్తం 27 మందిని నియమించారు.

సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో కలిపి జోనల్ ఆఫీసర్స్ 21, ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 4, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ లు 12 ఏర్పాటు చేశారు.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో ప్రిసైడింగ్ అధికారులు 140, వేములవాడ మున్సిపల్ పరిధిలో ప్రిసైడింగ్ అధికారులను 70 మందిని నియమించారు. రెండు మున్సిపాలిటీలలో కలిపి ఏపీఓలు మొత్తం 210 మందిని నియమించారు. ఓపీఓలు మొత్తం 630 మందిని నియామకం చేసారు.

**అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది కలిపి 400, వేములవాడ మున్సిపల్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది కలిపి 300.. మొత్తం 700 మందిని నియమించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు.

**ఓటరు జాబితాలో పేరు ఉండి ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా..**

ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు జాబితాలో పేరుండి .. ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) కాకుండా ఈ కింద చూపిన ప్రత్యామ్నాయ ఫొటో ఐడీలలో దేనినైనా ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఆధార్, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకు, తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ బుక్, కేంద్ర కార్మికశాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు లేదా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్‌పిఐ) కింద రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా(=+×) జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్ పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ పత్రాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్ యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజేబుల్ గుర్తింపు కార్డు (యూడీఐడీ)లు కలిగి ఉండాలి.

**ఓటు హక్కు ను వినియోగించుకోవాలి**

**–ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**

జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలి. మున్సిపల్ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి.

## కాంగ్రెస్ అభ్యర్థి పూదరి అనూష మహేందర్ ను గెలిపించండి

### - ఎమ్మెల్యే విజయ రమణ రావు



**పెద్దపల్లి ఫిబ్రవరి ప్రజా దివాస్**పెద్దపల్లి పట్టణం 11వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి పూదరి అనూష మహేందర్ , ఎమ్మెల్యే విజయరమణారావు బహిరంగ సభలో!....వార్డు ప్రజలు కరత్వాల ధ్వనులతో అనూష మహేందర్ గెలుపు అని విజయకేతనంతో జేజేలు కొట్టారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకొని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో పెద్దపల్లి నీ వాడవాడలా సుందరంగా తీర్చి దిద్దడానికి అవకాశం ఉంటుందని 11వ వార్డులోని ప్రజలందరికీ మౌలిక సదుపాయాలు కల్పిస్తూ రోడ్లు డ్రైనేజీలు పేదవారికి పక్కాఇండ్లు ప్రతి ఒక్కరికి సహకారాలు అందిస్తూ అందుబాటులో ఉంటూ పనిచేస్తాడు .కాంగ్రెస్ అభ్యర్థి పూదరి అనూష మహేందర్ చేయి గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించండి .మరిన్ని నిధులు తీసుకొచ్చి పెద్దపల్లి పట్టణం వాడ వాడలో అభివృద్ధికి తోడ్పడుదాం అని తెలిపారు.కాన్సిలర్ అభ్యర్థి 11వ వార్డు లో గెలుపు ఆదిక్యాంలో ముందున్న వార్డ్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మన 11వ వాడలో మీ అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను అమలు పరుస్తూ డ్రైనేజీ రోడ్లు త్రాగునీరు సమస్యలను మెరుగుపరుస్తూ నూతన కార్యక్రమాలు చేపడుతూ వాడ అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు కాంగ్రెస్ పార్టీ విజయ రమణ రావు బలపరిచిన నన్ను పూదరి అనూష మహేందర్ మాకు మీ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటరు మహాశయులను వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డు పెద్దలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పథకాలే మా బలం..

### - 25 వ వార్డు అభ్యర్థి కడవ నవీన్ కుమార్

**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 8 ప్రజా దివాస్** కాంగ్రెస్ పథకాలే మా విజయానికి బలం చేకూర్చు తాయని ఏ దూలపురం మున్సిపాలిటీ 25వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కడవ నవీన్ కుమార్ విజ్ఞ ప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం లో భాగంగా ఆదివారం 25 వ వార్డులో ఇంటింటా తిరిగి చేతిగుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంకు వెళ్లిన ఆయనకు ఓటర్ల నుంచి విశేష ఆధరణ లభించింది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నేతృత్వం లో రాష్ట్రంలో ప్రజాపాలన జరుగు తుందన్నారు. ఇందులో భాగంగానే ఇచ్చిన హామీ ప్రకారం రెతులకు రూ. 2లక్షల లోపు రుణమాఫీ, ఆర్టీసీ బస్సు లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల లోపు గృహాలకు ఉచిత విద్యుత్, రూ.500 వంటగ్యాస్ సిలిండర్, అర్హులైన వారికి విరివిగా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం మరియు సమాచార శాఖ మంత్రి




పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అద్వర్యంలో మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దన్నారు. 25 వ వార్డులో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్య, త్రాగు నీటి సరఫరా నిర్వహణ సక్రమంగా చేస్తానని చెప్పారు.

## లక్ష్మీనంబులాద్రి స్వామి వారిని దర్శించుకున్న జిల్లా న్యాయ అధికారి సునీత కుంచాల



**పెద్దపల్లి ఫిబ్రవరి 08 ప్రజా దివాస్** దేవులపల్లి లక్ష్మి నంబులాద్రి జాతర నేపథ్యంలో విచ్చేసిన జిల్లా న్యాయ అధికారి సునీతకుంచాల ,జూనియర్ సివిల్ జడ్జి మంజుల కు శాలువ కప్పి స్వాగతం పలికిన సర్పంచ్ అట్లా కుమార్ ఆలయ చైర్మన్ అట్లా శ్రీనివాస్ లక్ష్మి నంబులాద్రి స్వామి ఆలయంలో అర్చకుల వేద ఉచ్చారణ తో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు తదుపరి స్వామి వారు గుట్ట పై వెలసిన కొలువైన విధానాన్ని అర్చకులు వివరించారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమార్ ఆలయ చైర్మన్ శ్రీనివాస్ భక్తులు తదితరులు పాల్గొన్నారు

## కాల్వ శ్రీరాంపూర్ లో 108 వాహనం లేక ప్రాణాలు కోల్పోతున్న కుటుంబాలు రాగుల రాజ్ కుమార్ గౌడ్



**కాల్వ శ్రీరాంపూర్ ఫిబ్రవరి 08 ప్రజా దివాస్** కాల్వ శ్రీరాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 108 అంబులెన్స్ లేక చుట్టుపక్కల ఉన్న గ్రామాలలో యాక్సిడెంట్ . పాయిజన్ . తీసుకున్న వ్యక్తులను హాస్పటల్ తీసుకువెళ్లే సమయంలో అంబులెన్స్ లేక భయపడి ప్రవేట్ వెహికల్స్ రాక అక్కడి అక్కన్నే పిట్టల్లాగా రాలిపోతున్నారని రాగుల రాజు కుమార్ గౌడ్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రాణాలు కోల్పోయి ఆ కుటుంబం దుఃఖ దృక్పదల లో మునిగిపోతుందని. ఇక్కడ ఉన్న స్థానికులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని అంబులెన్స్ విషయంలో. నిన్న జరిగిన శ్రీరాంపూర్ మండలంలో చినరాత్ పల్లి క్రాస్ వద్ద యాక్సిడెంట్ లో అంబులెన్స్ అందుబాటులో ఉంటే వ్యక్తి బతికేవాడని . గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు పట్టించుకోలేదు. ఇప్పుడు స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులు పట్టించు కోవడం లేదన్నారు అంబులెన్స్ శ్రీరాంపూర్ మండలంలో ఉంటే ప్రమాదంలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడిన వారు అవుతారన్నారు ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు 108 వాహనాన్ని శ్రీరాంపూర్ మండల కేంద్రంలో ఉండేటట్టు చూడాలన్నారు

## ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తా




### - మంత్రి సహాకారంతో కాలనీ అభివృద్ధి పరుస్తా

### - 5వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి బానోతు నాగేంద్ర ప్రసాద్

**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 8 ప్రజా దివాస్** పాలేరు శాసనసభ్యులు మరియు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహాకారంతో 5 వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని కాంగ్రెస్ 5వ వార్డు అభ్యర్థి బానోతు నాగేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన 5 వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్లను కలుసుకున్నారు.5 వార్డు ప్రజాలు అవకాశం ఇస్తే వార్డును మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ దిశగా తనకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పూర్తి మద్దతు ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పని చేస్తానని, నిరంతరం సేవలందించడమే తన లక్ష్యమని నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

## అండర్-19 వరల్డ్‌కప్‌లో భారత్ డామినెన్స్

**వరల్డ్‌కప్‌లలో భారత్ ఆడిన మ్యాచ్‌లు 38**

**కేవలం 3 మ్యాచ్‌లలో మాత్రమే ఓటమి**

### 92 శాతం విజయాలు..



**2016 నుంచి అండర్-19 వరల్డ్‌కప్‌లలో భారత యువ జట్టు చూపిస్తున్న ప్రదర్శన ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ కాలంలో భారత్ ఆడిన మ్యాచ్‌ల సంఖ్య, సాధించిన విజయాలు చూస్తే.. యువ క్రికెట్‌లో టీమిండియా ఎంత బలంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. నిలకడ, లోతైన బ్యాటింగ్ లైనప్, క్రమశిక్షణతో కూడిన బౌలింగ్ దళం భారత్‌ను ఇతర జట్ల కంటే ముందుకు తీసుకెళ్తోంది.**

2016 నుంచి ఇప్పటివరకు జరిగిన అండర్-19 వరల్డ్‌కప్‌లలో భారత్ మొత్తం 38 మ్యాచ్‌లు ఆడింది. అందులో ఏకంగా 35 మ్యాచ్‌లలో విజయం సాధించి.. అద్భుత రికార్డు నెలకొల్పింది. కేవలం 3 మ్యాచ్‌లలో మాత్రమే ఓటమిని చవిచూసింది. ఆ మూడు పరాజయాలు కూడా లీగ్ లేదా నాకౌట్ దశల్లో కాకుండా.. నేరుగా ఫైనల్ మ్యాచ్‌ల్లో ఉండడం గమనార్హం. 2016, 2020, 2024 అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో భారత్ ఓటమిని ఎదుర్కొంది. అయినప్పటికీ ఫైనల్ వరకు చేరుకోవడం, వరుసగా టైటిల్ పోరులో నిలవడం భారత యువ క్రికెట్ బలాన్ని స్పష్టంగా చూపిస్తోంది.

అండర్-19 వరల్డ్‌కప్‌లలో భారత్ విజయం శాతం 92.1 శాతంగా ఉంది. వరల్డ్‌కప్ చరిత్రలో ఇది గొప్ప రికార్డుల్లో ఒకటి. మొత్తంగా చూస్తే.. 2016 నుంచి అండర్-19 వరల్డ్‌కప్‌లలో భారత్ యువ జట్టు ఆధిపత్యం అసాధారణం అనే చెప్పాలి. వరల్డ్‌కప్‌లలో ప్రతిసారి ఫైనల్స్ చేరడం, అధిక విజయ శాతం నమోదు చేయడం భారత క్రికెట్ వ్యవస్థ పటిష్టతకు నిదర్శనం. ఈ యువ ఆటగాళ్లే రానున్న రోజుల్లో సీనియర్ టీమిండియాకు వెన్నెముకగా మారతారనే నమ్మకం క్రికెట్ అభిమానుల్లో బలంగా ఉంది.

## వరల్డ్ క్రికెట్‌లో భారత్ సువర్ణాధ్యాయం





### రెండేళ్లలో ఐదు ఐసీసీ ట్రోఫీలు!

### ఐసీసీ ట్రోఫీలపై భారత్ సంపూర్ణ ఆధిపత్యం

**భారత క్రికెట్ మరోసారి ప్రపంచానికి తన శక్తిని చాటింది. సీనియర్ నుంచి అండర్-19 వరకూ.. పురుషులు, మహిళలు అన్ని విభాగాల్లో టీమిండియా అద్భుత విజయాలు సాధిస్తూ ఐసీసీ ట్రోఫీలపై సంపూర్ణ ఆధిపత్యాన్ని నెలకొల్పింది. ప్రస్తుతం భారత్ ఒకేసారి ఐదు ప్రధాన ఐసీసీ టైటిల్స్‌ను తన ఖాతాలో వేసుకుని ప్రపంచ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించింది.**

పురుషుల విభాగంలో భారత్ 2024లో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌ను గెలుచుకుని పొట్టి ఫార్మాట్‌లో తన సత్తాను నిరూపించింది. ఆ తర్వాత 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని కూడా సొంతం చేసుకుని. వన్డే క్రికెట్‌లోనూ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఈ రెండు విజయాలు భారత సీనియర్ జట్టు స్థిరత్వం, లోతైన బెంచ్ స్ట్రెంత్‌కు నిదర్శనంగా నిలిచాయి.

మహిళల క్రికెట్‌లోనూ భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 2025 మహిళల వన్డే వరల్డ్‌కప్‌ను గెలుచుకుని తొలిసారి ఈ ప్రతిష్టాత్మక ట్రోఫీని భారత మహిళల జట్టు అందుకుంది. అంతేకాదు, అదే ఏడాది జరిగిన మహిళల అండర్-19 వరల్డ్‌కప్‌లోనూ భారత్ విజేతగా నిలిచి యువ ప్రతిభలోనూ తన ఆధిపత్యాన్ని చాటింది.

యువ క్రికెట్‌లో భారత జట్టు ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. 2026లో జరిగిన పురుషుల అండర్-19 వరల్డ్‌కప్‌ను గెలుచుకుని భారత్ మరోసారి భవిష్యత్ క్రికెట్ తనదేనని నిరూపించింది. వరుసగా వస్తున్న యువ ఆటగాళ్లు అంతర్జాతీయ స్థాయికి సిద్ధంగా ఉండటం భారత క్రికెట్ వ్యవస్థ బలాన్ని చూపిస్తోంది.

ప్రస్తుతం భారత్ ఒకేసారి పురుషుల టీ20 వరల్డ్‌కప్ (2024), ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ (2025), మహిళల వన్డే వరల్డ్‌కప్ (2025), మహిళల అండర్-19 వరల్డ్‌కప్ (2025), పురుషుల అండర్-19 వరల్డ్‌కప్ (2026) టైటిల్స్‌ను కలిగి ఉంది. ఇది ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అరుదైన ఘనతగా నిలుస్తోంది. అన్ని స్థాయిల్లోనూ విజయాలు సాధిస్తూ.. భారత క్రికెట్ నిజంగా స్వర్ణయుగంలోకి అడుగుపెట్టిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

## వైభవ్ సూర్యవంశీని బ్యాన్ చేయాలి

### ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ సంచలన వ్యాఖ్యలు

### వరల్డ్‌కప్ ఫైనల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ

### 80 బంతుల్లో 15 సిక్సులు, 15 ఫోర్లతో 175 పరుగులు



**హరారే:** అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన భారత యువ సంచలనం, 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ పేరు ప్రపంచ క్రికెట్‌లో ఇప్పుడు సంచలనంగా మారింది. ఇంగ్లాండ్‌తో జరిగిన 2026 వరల్డ్‌కప్ ఫైనల్‌లో 55 బంతుల్లోనే సెంచరీ బాదాడు. మొత్తంగా 80 బంతుల్లో 15 సిక్సులు, 15 ఫోర్లతో 175 పరుగులు చేశాడు. వైభవ్ అద్భుత ప్రదర్శనను జీర్ణించుకోలేని ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్, ప్రముఖ కామెంటేటర్ నాసిర్ హుస్సేన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. బీసీసీఐ ప్రభావాన్ని అరికట్టేందుకు సూర్యవంశీని క్రికెట్ నుంచే నిషేధించాలని డిమాండ్ చేశాడు. హుస్సేన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

నాసిర్ హుస్సేన్ మాట్లాడుతూ 'ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే బీసీసీఐ ప్రపంచ క్రికెట్‌ను నాశనం చేస్తోంది. భవిష్యత్తులో క్రికెట్‌లో నిజమైన స్పిరిట్ ఉండకపోవచ్చు. క్రికెట్‌కు, రాజకీయాలకు ఎలాంటి సంబంధం ఉండకూడదు' అని వ్యాఖ్యానించాడు. గతంలో ఐసీసీపై బ్రిటన్ ప్రభావం ఉన్నప్పుడు దక్షిణాఫ్రికాను సుమారు 20 ఏళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్‌కు దూరం పెట్టారని, జింబాబ్వేకు ఇంగ్లాండ్‌లో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌కు వీసాలు నిరాకరించారని గుర్తు చేశాడు. అవన్నీ మానవత్వం, ప్రపంచ సూత్రాల పేరుతో తీసుకున్న నిర్ణయాలేనని సమర్థించుకున్నాడు.

భారత్-పాకిస్తాన్ క్రికెట్ సంబంధాలపై కూడా నాసిర్ హుస్సేన్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. 'ఉగ్రవాదం పేరుతో పాకిస్తాన్‌పై భారత్ రాజకీయాన్ని క్రికెట్‌లోకి తెస్తోంది. ఇది పూర్తిగా హాస్యాస్పదం. ఆటకు ఇది పూర్తి విరుద్ధం' అంటూ బీసీసీఐని విమర్శించాడు. ఇక వైభవ్ సూర్యవంశీ ప్రదర్శనపై అసహనం వ్యక్తం చేస్తూ 'ఇప్పుడు మా (ఇంగ్లాండ్) జట్టుపై 14 ఏళ్ల పిల్లాడు ఫైనల్‌లో వేగవంతమైన సెంచరీ చేశాడు.

ఇది బీసీసీఐ ప్రభావాన్ని మరింత పెంచుతుంది. దీని వల్ల క్రికెట్ తప్పుదారి పడే ప్రమాదం ఉంది. బీసీసీఐ ప్రభావాన్ని అరికట్టేందుకు ఇతర దేశాలు ఈసీబీతో కలిసి రావాలి' అంటూ నాసిర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. హుస్సేన్ వ్యాఖ్యలపై విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. టీమిండియాపై హుస్సేన్ అక్కసు వెళ్లగక్కడం ఇదేం కొత్త కాదు కానీ.. బీసీసీఐపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది.




## ఆస్ట్రేలియాకు బిగ్ షాక్..

### వరల్డ్ కప్‌కి స్టార్ బౌలర్ దూరం

### నేటి నుంచి ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్..

### గాయంతో మెగా టోర్నీకి దూరమైన జోష్ హేజిల్‌వుడ్..

నేటి నుంచి ప్రారంభమయ్యే టీ20 వరల్డ్ కప్ కు ముందు ఆస్ట్రేలియా జట్టుకు బిగ్ షాక్ తగిలింది. కీలక ప్లేయర్ జోష్ హేజిల్‌వుడ్ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఈ మెగా టోర్నమెంట్ కు పూర్తిగా దూరమయ్యాడు. దీంతో జోష్ హేజిల్‌వుడ్ స్థానంలో ప్రస్తుతం ఎవరినీ భర్తీ చేయడం లేదని క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటన చేసింది. గాయం నుంచి కోలుకుని టోర్నమెంట్ మధ్యలో జట్టులో చేరతాడు అనే ఆశలు ఉన్నప్పటికీ, తాజా మెడికల్ రిపోర్ట్స్ ఆ అవకాశాన్ని నిరాకరించాయి.

కాగా, ఈ విషయంపై సెలక్టర్ టోనీ డోడెమైడ్ మాట్లాడుతూ.. సూపర్- 8 దశ నాటికి హేజిల్‌వుడ్ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని మేం అనుకున్నాం.. కానీ తాజా పరిస్థితుల ప్రకారం అతడు కోలుకోవడానికి ఇంకా కొంత టైం పడుతుంది అన్నారు. అతడిని తొందరపెట్టి మైదానంలోకి దింపడం ప్రమాదకరం అని చెప్పారు. ప్రస్తుతం ఉన్న జట్టుతోనే ప్రారంభ మ్యాచ్‌లు ఆడగలం అనే నమ్మకం తమకు ఉందని పేర్కొన్నారు. అవసరం ఉంటే మాత్రమే రీప్లేస్‌మెంట్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని టోనీ డోడెమైడ్ తేల్చి చెప్పారు. ఇక, ఆస్ట్రేలియా జట్టు ఫిబ్రవరి 11వ తేదీన ఐర్లాండ్‌తో తమ తొలి మ్యాచ్‌ను ఆడనుంది. ఈ టోర్నీలో ఆస్ట్రేలియా తమ మొదటి నాలుగు మ్యాచ్‌లను శ్రీలంకలోని పల్లెకెలె, కొలంబో వేదికలలో ఆడనుంది.

అయితే, టీ20 ప్రపంచకప్ 2026 నేటి నుంచి ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 7వ తేదీన అట్టహాసంగా స్టార్ట్ కానున్న ఈ మెగా టోర్నమెంట్, మార్చి 8వ తేదీన జరిగే ఫైనల్‌తో ముగియనుంది. ఈసారి ప్రపంచకప్ టైటిల్ కోసం మొత్తం 20 జట్లు బరిలో ఉండగా, 55 మ్యాచ్‌లు జరగనున్నాయి.






## స్మృతి మంధానకు కోహ్లీ స్పెషల్ విషెస్

**న్యూఢిల్లీ:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఛాంపియన్‌గా నిలవడంతో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ హర్షం వ్యక్తం చేశాడు. అద్భుతమైన విజయం సాధించిన ఆర్సీబీ మహిళల జట్టుకు, మేనేజ్‌మెంట్‌కు విరాట్ శుభాకాంక్షలు తెలిపాడు. కెప్టెన్ స్మృతి మంధాన, ఆర్సీబీ జట్టును చూసి గర్వపడాలని అన్నాడు. రెండోసారి ఛాంపియన్‌గా నిలిచి ఆర్సీబీ పతాకాన్ని అత్యున్నత స్థానంలో ఎగురవేశారని అభినందించాడు. ఈ మేరకు సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ షేర్ చేశాడు.'రెండోసారి ఛాంపియన్‌గా నిలిచి ఆర్సీబీ పతాకాన్ని అత్యున్నత స్థానంలో ఎగురవేశారు. మిమ్మల్ని చూస్తుంటే గర్వంగా ఉంది. స్మృతి మంధాన, ఆర్సీబీ జట్టు, మేనేజ్‌మెంట్‌కు శుభాకాంక్షలు. ఈ విజయానికి మీరు నిజమైన అర్హులు. ఈ అద్భుతమై క్షణాలను ఆస్వాదించండి' అని విరాట్ కోహ్లీ ఆర్సీబీ ట్రోఫీ ఫొటోను షేర్ చేస్తూ రాసుకొచ్చాడు. మహిళల జట్టు నెగ్గడంతో విరాట్ పోస్టు పెట్టడంపై ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్?లో తమ జట్టు కూడా ఇదే రిపీట్ చేయాలని ఆశిస్తున్నట్లు కామెంట్లు పెడుతున్నారు.ఈ ఫైనల్?లో ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన (87 పరుగులు, 41 బంతుల్లో) సూపర్ ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. అయితే మంధాన జ్వరంతో బాధపడుతూనే ఈ మ్యాచ్‌లో బరిలో దిగినట్లు ఆర్సీబీ కోచ్ మలోలన్ రంగరాజన్ తెలిపాడు. అనారోగ్యంగా ఉన్నప్పటికీ జట్టు కోసం బరిలో దిగడాన్ని ఆయన కొనియాడాడు. ఈ మేరకు మ్యాచ్ అనంతరం ప్రెస్‌మీట్‌లో రంగరాజన్ చెప్పాడు. 'ఫైనల్ మ్యాచ్‌లో మంధాన అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు మంధాన తీవ్రమైన ఫ్లూతో బాధ పడుతోంది. చాలా అనారోగ్యంగా ఉంది. కానీ ఆ ప్రభావం మ్యాచ్ మీద పడలేదు. దీని గురించి నేను ఆమెతో మాట్లాడినప్పుడు, 'ప్రాబ్లమ్ ఏం లేదు, నేను ఆడతాను' అని చెప్పింది. గత ఏడాది కాలంగా ఆమె మంచి ఫామ్‌లో ఉంది. అయిత ఆమె ఈ రోజు ఆడిన ఇన్నింగ్స్‌ను వర్ణించడానికి మాత్రం నాకు మాటలు చాలడం లేదు. మంచి టైమింగ్‌తో బ్యాటింగ్ చేసింది. వీలు చిక్కినప్పుడు ఎటాకింగ్ మోడ్‌లోకీ మారింది. బ్యాటింగ్‌లో ఆమె ఒక మేధావి. తన ఆటను, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది' అని రంగరాజన్ పేర్కొన్నాడు. కాగా, గురువారం వడోదర వేదికగా దిల్లీ క్యాపిటల్స్?తో జరిగిన డబ్ల్యూపీఎల్ ఫైనల్‌లో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. దిల్లీ నిర్దేశించిన 204 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ 4 వికెట్లు కోల్పోయి 19.4 ఓవర్లలో ఛేదించింది. స్మృతి మంధాన (87 పరుగులు), జార్జియా వోల్ (79 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. మంధానకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ లభించింది.